క్లుప్తంగా

కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు శంకరరావు, ముజీబ్ పసల, న్యాయవాదులు చీపుర్లు పట్టి చెత్తాచెదారం ఊడ్చారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఏజీపీ భాస్కరరెడ్డి, విశ్వనాథ్‌నాయక్, రాజేష్ నాయక్, సుదర్శనరెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కదాడిలో విద్యార్థికి గాయాలు



గాయపడిన విద్యార్థి మనోజ్

పెనుకొండ: కుక్క దాడిలో మనోజ్ అనే విద్యార్థి శుక్రవారం గాయపడ్డాడు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని ఇస్లాపురానికి చెందిన మనోజ్ జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నాడు. మధ్యాహ్న సమయంలో పాఠశాల బయట దుకాణం వద్ద కుక్క దాడి చేసింది. విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందిస్తున్న బ్యాంకు మేనేజర్ కమలాకర్ తదితరులు

గోరంట్ల: మహిళా సంఘాలకు మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ కమలాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 21 మహిళా సంఘాలకు మంజూరైన రూ.2 కోట్ల రుణాల చెక్కును వైకేపీ ఏపీఎం నారాయణ ద్వారా బ్యాంకర్లు అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాజ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది యుగంధర్ రెడ్డి, వైకేపీ సీసీలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని ప్రజ్ఞకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఓబుళపతి

అమరాపురం: ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లా స్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో అమరాపురం ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ప్రజ్ఞ ఉత్తమ ప్రతిభ కనబరిచనట్లు ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థినికి శుక్రవారం కళాశాలలో సర్టిఫికెట్ అందజేశారు. ప్రజ్ఞ విద్యతో పాటు యోగాలో రాణించడం హర్షణీయమన్నారు.

క్రమశిక్షణతో చదువుకోండి



రత్నగిరిలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రొళ్ల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ ఆజాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రత్నగిరి ఆదర్శ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనువైన స్థలాన్ని ఎంఈఓ-2 శ్రీధర్, ఈఓఆర్డీ క్రిష్ణప్పతో కలిసి పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులు పిల్లలను సక్రమంగా బడికి పంపాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం పూట రాగిజావ, మధ్యాహ్నం వేళల్లో పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిప్రసాద్, కార్యదర్శి రచన, ఏఎస్ఎం నాగరేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గుడిబండ: మైనిగానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా గ్రామానికి తాగునీరు అందించేవారు. విషయం తెలుసుకున్న రాళ్ళపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. తన సొంత నిధులతో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కేబుల్ వైర్‌ను కొనుగోలు చేశారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి, తాగునీటి సమస్య పరిష్కరించారు. గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే సీసీ రోడ్లు పనులు చేపట్టామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేయిస్తామని తెలిపారు. ముఖ్యంగా అంబేడ్కర్ సర్కిల్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకెళ్ళి ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ అధికారులు జాప్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్లు చెప్పే సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదే విధంగా పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్యపై ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. పారిశుద్ధ్యంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అన్ని వార్డుల్లో వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలిగేలా చూడాలన్నారు. చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. పలువురు కౌన్సిలర్లు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ ప్రభాకర్‌రావు, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

ఎన్నికలకు సిద్ధం కండి

మడకశిర: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు. శుక్రవారం ఆర్అండ్‌బీ విశ్రాంత భవనంలో నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలకు కేవలం ఏడు నెలల సమయం మాత్రమే ఉందని తెలిపారు. పార్టీకి ఈ ఏడు నెలలు చాలా కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా బూత్ ఏజెంట్లు ఎన్నికల సమయంలో కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామ స్థాయిలో బోగస్ ఓట్లను గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అదే విధంగా గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని చెప్పారు. పార్టీ ఇటీవల మండలాలకు కన్వీనర్లను కూడా నియమించిందన్నారు. బూత్ ఏజెంట్లు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్, మండల కన్వీనర్లు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీలు, మండల కన్వీనర్లు, వైస్ ఎంపీపీలు, సింగల్ విండో అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయాల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పరిగి: మండలంలో శనివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. తొలుత ఉదయం 9.30 గంటలకు స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరవుతారన్నారు. అనంతరం 11 గంటలకు స్థానిక వైకేపీ కార్యాలయంలోని సమావేశ భవనంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి అన్న అంశంపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తారన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెనుకొండ రూరల్: మునిమడుగు గ్రామంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచు అశ్వర్థనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

3న స్పాట్ అడ్మిషన్లు

హిందూపురం: స్థానిక మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో అక్టోబరు 3న ఈసీఈ, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో మిలిగిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిష్‌బాబు శుక్రవారం తెలిపారు. శనివారం కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్ల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. టెన్త్ ఉత్తీర్ణులై, పాలీసెట్ రాయకపోయినా ఫర్వాలేదన్నారు. అభ్యర్థులు 3వతేదీలోపు కళాశాలలో 10 గంటలలోపు ఒరిజినల్ పత్రాలు మూడుసెట్ల జిరాక్స్‌తోపాటు ప్రాసెసింగ్ ఫీజు రూ.1,100, కోర్సు ఫీజు రూ.4,700 అదేరోజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఇదే చివరి అవకాశమన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థినులు తక్షణమే తరగతులను హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

హిందూపురం: రానున్న ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దామని నియోజకవర్గ సమన్వయకర్త కురబ దీపిక అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ పట్టణ ఏబ్లాక్ కన్వీనర్ సిపిసి సాధిక్, బిబ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా దీపిక మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలందరికీ వివరించాలన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ గెలుపు కోసం పాటుపడాలన్నారు. హిందూపురం రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండల కన్వీనర్లుగా నియమితులైన సంతెబిదునూర్ రాము, నారాయణస్వామి, ప్రభాకర్‌రెడ్డి సమన్వయకర్త దీపికను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబివుల్లా, కౌన్సిలర్లు, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏ,బీ బ్లాక్ కన్వీనర్లు సాదిక్, వాల్మీకి నరేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

మడకశిరరూరల్: ఎలాంటి రసాయనాలు వాడని ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా మారిందని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని భీమరాయనపల్లి, ఆమిదాలగొంది, నీలకంఠాపురం, గోవిందాపురం, గౌడనహళ్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మడకశిర డివిజన్‌లో దాదాపు 134 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు ఈ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ పద్ధతుల సాగుకు అధిక ప్రాధాన్యత కల్పించి రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ నరేంద్ర, జిల్లా కో-ఆర్డినేటర్ భానుమతి, డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

కావేరి జలాలు వదలొద్దు

పావగడ: కావేరి జలాలలను తమిళనాడుకు వదలకూడదని వివిధ సంఘాల నాయకులు శుక్రవారం పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బంద్ సందర్భంగా దుకాణాలు, హోటళ్లు, విద్యా సంస్థలను స్వచ్ఛందంగా మూసి వేశారు. తొలుత శనిమహాత్మ సర్కిల్ నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తాలూకా కార్యాలయాన్ని ముట్టడించి, అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ.. కర్ణాటకలో వర్షాలు లేక తాగు, సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావేరి నది ఎండిపోతుంటే తమిళనాడుకు నీరు వదలడం సమంజసం కాదన్నారు. మైసూరు జిల్లా, చామరాజపేటె, బెంగుళూరు ప్రాంతాల ప్రజలు దాహార్తితో ఇబ్బందులు పడతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని కావేరి జలాలను తమిళనాడుకు వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు.

ప్రజారోగ్యం కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ప్రజారోగ్యం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త కురుబ దీపిక అన్నారు. శుక్రవారం హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష,ఎందుకు 'ఆంధ్రాకి జగనే కావాలి?' అనే కార్యక్రమాలపై హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, మున్సిపాల్టీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 30 నుంచి ప్రతి పంచాయతీ, వార్డు పరిధిలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి గుర్తించిన వారికి అవసరమైతే మళ్లీ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. నెలరోజులపాటు గ్రామ, పట్టణ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అలాగే 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' కార్యక్రమం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగిన అదే గ్రామంలో తిరిగి పది రోజుల తర్వాత మరలా సాగుతుందన్నారు. దీనిపై పార్టీ మండలాధ్యక్షులు, సీనియర్ నాయకులతో ఆయా గ్రామాల్లో రాత్రి అక్కడే బస చేసి ప్రజల సమగ్ర ఆరోగ్య వివరాలు తెలుసుకుంటామన్నారు. సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, జేసీఎస్ కన్వీనర్ మారుతిరెడ్డి, పట్టణ ఏ, బీ బ్లాక్ కన్వీనర్లు సీపిసి సాదిక్, నరేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఇలియాజ్, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, మండలాల అధ్యక్షులు రాము, నారాయణస్వామి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: వీరాపురంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక హాజరవుతారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి పేర్కొన్నారు.

గోరంట్ల: స్థానిక మాడో సచివాలయంలో ఎంపీడీఓ రఘునాథగుప్త అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అధికారులతో శుక్రవారం సమావేశం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి, జబ్బులు గుర్తించి, క్యాంపుల్లో పరీక్షలు చేయించాలని, నయం అయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈఓ గోపాల్, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ సాయి సుప్రీత, డాక్టర్ కళ్యాణి, శృతి, తేజస్విని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మడకశిర: నియోజకవర్గంలో శనివారం ఐదు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతాయని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. పట్టణంలో హిందూపురం రోడ్డులో ఉన్న సరస్వతీ విద్యామందిరంలో జరిగే వైద్య శిబిరాన్ని ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రారంభిస్తారన్నారు.

మడకశిరరూరల్: చందకచెర్లు పంచాయతీలోని గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, సాధారణ వ్యాధులను యాప్‌లో నమోదు చేశారు. వైద్య శిబిరాల ద్వారా వీరికి గ్రామ స్థాయిలో వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

అమరాపురం: మండలంలోని హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుణేహళ్లి శుక్రవారం వైద్య సిబ్బంది ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు.

పెనుకొండ రూరల్: శెట్టిపల్లి, గోనిపేట, నాగళూరు గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ తిరుగుతూ వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని గుర్తించి, మెడికల్ క్యాంపులకు రావాలని సూచించారు.

రొళ్ల: రత్నగిరి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ ఆజాద్ ఓ ప్రకటనలో కోరారు.

పరిగి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ కృష్ణయ్య శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ స్వరూపరెడ్డి, సురేష్‌కుమార్, ఎంపీడీఓ సరస్వతి, ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీ చంద్రారెడ్డి, శివశంకర్, సీహెచ్ఓ వన్నప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు అత్యవసర సమావేశం

పెనుకొండ: నగర పంచాయతీ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ శుక్రవారం తెలిపారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్ అధ్యక్షతన జరిగే సమావేశంలో కౌన్సిలర్లు, సిబ్బంది సమావేశంలో తప్పక పాల్గొనాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పరిగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఈఓఆర్డీ శ్రీధర్ సూచించారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. చిన్నారులకు పప్పన్నం బదులుగా చిత్రాన్నం ఎందుకు వడ్డించారని అంగన్‌వాడీ కార్యకర్త సుశీలమ్మను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ మల్లికార్జున పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎంఎస్ స్వామినాథన్

హిందూపురం టౌన్: దేశాన్ని కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కించిన హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చిరస్మరణీయుడి అని బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ స్వామినాథన్ సేవలను కొనియాడారు.

బూత్ కమిటీల బలోపేతానికి కృషి

పరిగి: క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన పరిగి బీరప్ప ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మంటపంలో పంచాయతీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవాపక్వాడ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బద్రీనాథ్, ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బంగారు చంద్ర, గోవిందు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామరెడ్డి జయంతిని విజయవంతం చేయాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలో అక్టోబర్ 6న నిర్వహించే మాజీ పార్లమెంట్ సభ్యుడు శ్రీరామరెడ్డి జయంతిని విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన స్వగృహంలో జయంతి నిర్వహణపై నాయకులతో చర్చించారు. ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా ఎస్పీ కె.వి అశోక్, తుమకూర్, సిటీ మున్సిపల్ కమిషనర్ బి.వి అశ్విజ హాజరవుతారన్నారు. క్రీడా పోటీల్లో విజేతలు, గత ఏడాది టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాగి తీగ అపహరణ

లేపాక్షి: కల్లూరు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగితీగను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న ఏఈ వెంకటేశులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ. 2 లక్షలు ఉంటుందని, ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వారం రోజుల క్రితం కూడా కొండూరు జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును దొంగలించుకుపోయారని ఆయన గుర్తు చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడకశిరరూరల్: మండల పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో శుక్రవారం మడకశిర నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో ఇరుక్కుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

దేశభక్తి పెంపొందించుకోండి

గుడిబండ: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన మట్టిని కలశాలతో ఊరేగించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికే నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంఈఓ తెలిపారు. దేశభక్తి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రొళ్ల, హొట్టేబెట్ట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్, స్వచ్ఛతా హీ సేవా, 'నా భూమి-నా దేశం' కార్యక్రమంలో ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ-2 శ్రీధర్ మాట్లాడుతూ..సేకరించిన మట్టితో దేశ రాజధానిలో అమరవీరుల స్తూపాన్ని ఏర్పాటు చేసి స్మరించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనాథ్ పాల్గొన్నారు.




రొళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరులను స్మరించుకోవాలి

పరిగి: వీర జవానులను స్మరించుకోవాలని వక్తలు తెలిపారు. శుక్రవారం పరిగి మండల వ్యాప్తంగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సరస్వతి, ఎస్ఐ నరేంద్ర, ఎంపీపీ సవిత, వైస్ ఎంపీపీ వేదవతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృపాసత్యరాజు, డీటీ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ జయరాం, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, నరసింహారెడ్డి (చంటి), ఎంపీటీసీ మారుతీరెడ్డి, శివశంకర్, చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పరిగి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరంగరాజుపల్లిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి అధికారులు నిర్వహించారు. స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీధర్, ఉపాధ్యాయులు, సెక్రటరీ నజ్మా, స్వచ్ఛభారత్ ఎమ్మార్పీ మల్లికార్జున, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, సచివాలయ సిబ్బంది

తూమకుంటలో 'స్వచ్ఛతా హీ సేవ'

హిందూపురం అర్బన్: మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకొని తూమకుంట సచివాలయ పరిధిలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం పంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రత , పారిశుధ్య నిర్వహణ తదితర వాటిపై సర్పంచ్ రత్నమ్మ, కార్యదర్శి కెంచరాయప్ప ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బంది మానవ హారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు. విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల సౌలభ్యం కోసమే మరుగుదొడ్ల నిర్మాణం



భూమి పూజ చేస్తున్న నాయకులు

పెనుకొండ: పట్టణంలోని ట్యాంక్ సర్కిల్లో ప్రజల సౌలభ్యం కోసం మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ట్యాంక్ సర్కిల్లో నిర్మల్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ ద్వారా బీఓటి పద్ధతిలో రెండు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి చైర్మన్ భూమి పూజ చేశారు. కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, వైస్ చైర్మన్ సునీల్, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సద్దాం, శేషాద్రి, నాయకులు ఫరీద్, యాసిన్, కిష్టప్ప, కిరణ్, గణేష్, పూలమూర్తి, కోఆప్షన్ మెంబర్ నేమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ శుక్రవారం తెలిపారు. కుక్కలను పట్టుకుని దూరప్రాంతాల్లో వదిలేస్తున్నామన్నారు.